క్లుప్తంగా

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈఓ నరసింహ

ఆత్రేయపురం: మండల కేంద్రం ఆత్రేయపురంలోని ప్రభుత్వ పాఠశాలలను రామచంద్రపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి శ్రీపాద నరసింహ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో రికార్డులు పరిశీలించి మధ్యాహ్న భోజనం ఎలా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎంలకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ వరప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

రాజోలు: తమను విధుల్లోకి తీసుకోవాలని రాజోలుకు చెందిన వలంటీర్లు ఎంపీపీ కేతా శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే మూడు నెలలుగా బకాయి ఉన్న జీతాలను విడుదల చేయాలని కోరారు. కరోనా, వరదల సమయంలో గ్రామాల్లో సేవలందించిన వలంటీర్లను గుర్తించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీడీఓ ఎస్.బాలాజీకి కూడా వినతిపత్రాన్ని అందించామని వలంటీర్లు తెలిపారు.

సామూహిక సీమంతాలు

రాజోలు: స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో రాజోలు ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలోని గర్భిణులకు సామూహిక సీమంతాలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ కేతా శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన శిశువులు పుడతారన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సీమంతాలు నిర్వహించామని సీడీపీఓ రమాదేవి వివరించారు. తాటిపాక పీహెచ్‌సీ పీహెచ్ఎన్ ఎ.సత్యవతి, సీహెచ్ఓ ఎం.ఎలిజిబెత్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు చేయూతనందించాలి



పాశర్లపూడిలంకలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

మామిడికుదురు: సామాజిక సేవా కార్యక్రమాలకు ఓఎన్‌జీసీ మరింత చేయూతను అందించాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథూర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. పాశర్లపూడిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సోమవారం సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సభలో ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.13.70 లక్షల వ్యయంతో సమకూర్చిన 199 సైకిళ్లను విద్యార్థులకు అందజేశారు. నాలుగు బీరువాలను జెడ్పీహెచ్ స్కూల్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నామన రాంబాబు మాట్లాడుతూ ఓఎన్‌జీసీ కార్యకలాపాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలకు సీఎస్ఆర్ నిధుల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం కేజీ బేసిన్ ఈడీ శాంతానుదాస్, ఎంపీపీ కుసుమ వనజకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కళ్లెరెడ్డి అంజిబాబు, ఎంపీటీసీ చేకూరి పార్వతి, కోలా సత్యనారాయణ, తెలగారెడ్డి బులినాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

అంబాజీపేట: విజయవాడ వరద బాధితులకు 98 మినిమం టైం స్కేల్(ఎంటీఎస్) టీచర్స్ ఫెడరేషన్ ఒక రోజు వేతనాన్ని సాయంగా అందజేసింది. రాష్ట్ర అధ్యక్షులు చొల్లంగి కేశవకుమార్ ఆధ్వర్యంలో ఒక రోజు వేతనం సుమారు రూ.36 లక్షలను వరద బాధితులకు విరాళంగా ముఖ్యమంత్రి సహాయనిధికి ఇస్తున్నట్లు అంగీకర పత్రాన్ని మంత్రి లోకేష్‌కు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్‌కు ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలపై వినతి పత్రాన్ని అందించామని కేశవకుమార్ తెలిపారు. లోకేష్‌ను కలిసిన వారిలో కార్యదర్శి టీజెడ్ మార్తాండరాజు, ఎస్.రాజగోపాలనాయుడు, కె.రాఘవేంద్ర, మల్లేష్‌లున్నారు.

వరద బాధితులకు విద్యార్థుల వితరణ



ముఖ్యమంత్రి సహాయనిధికి డీడీని అందజేస్తున్న విద్యార్థులు

రావులపాలెం: విజయవాడ వరద బాధితులకు సహాయార్థంగా మండలంలోని ఊబలంక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రూ.20,850 సేకరించి ముఖ్యమంత్రి సహాయ నిధికి డీడీ రూపంలో ఇచ్చారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీడీని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మేడపాటి సురేశ్వరరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్ ఉపాధ్యాయులు అభినందించారు.

ఉక్కబోత.. అంతలోనే కుండపోత

- ఉదయం నుంచి ఎండవేడిమి.. మధ్యాహ్నం వర్షం
- విభిన్న వాతావరణంతో ప్రజల అవస్థలు



కొత్తపేటలో కురుస్తున్న భారీ వర్షం



కొత్తపేటలో భారీ వర్షానికి నిర్మానుష్యంగా మారిన రహదారి

కొత్తపేట: ప్రస్తుతం వాతావరణం చాలా విచిత్రంగా ఉంటోంది. అసలు ఏ కాలమో తెలియని విధంగా ఉంటోంది. ఉదయం నుంచే సూర్యుడు ఎండతో చుర్రుమనిపిస్తున్నాడు. వేసవి కాలం మాదిరిగా విజృంభిస్తున్నాడు. అంతలోనే వరుణుడు రంగంలోకి దిగుతున్నాడు. ఇదే విధంగా కొత్తపేటలో సోమవారం ఉదయం నుంచి వేసవితాపంతో ఉక్కబోత దాడి చేయగా, మధ్యాహ్నానికి వాతావరణం మారిపోయి కుండపోత వర్షం కురిసింది. సోమవారం ఉదయం 11 గంటల వరకూ ఎండ కాసింది. మధ్యాహ్నం 11.30 గంటలకు వాతావరణం మారిపోయింది. 12 గంటలకు హఠాత్తుగా కుండపోత వర్షం కురిసింది. ఇలా ఒక్కసారిగా వాతావరణం మారిపోతుండడంతో ప్రజలు జ్వరాలు, ఒళ్లు నొప్పులు, దగ్గు తదితర రోగాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

విచిత్ర వాతావరణం

ఎండకాలంలో భానుడి వేడితో అల్లాడిన ప్రజలు వర్షాకాలంలో ఆహ్లాదకర వాతావరణంతో సేద తీరుతుంటారు. గతంలో ఎప్పుడూ ఇలాగే జరిగేది. వర్షా కాలంలో ఎండ కాసినా అంత ప్రచండంగా ఉండేది కాదు. అయితే ఇప్పుడు మాత్రం ఒకపక్క వరుణుడు, మరోపక్క భానుడు పోటాపోటీగా ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ఉదయం నుంచే ఎండ రావడంతో ఉక్కబోత ఎక్కువైపోతోంది. వేసవికాలం మాదిరిగా ఇళ్లలో ఏసీలు పనిచేయాల్సి వస్తోంది. మరోవైపు ఇంతలోనే కుండపోతగా వర్షం కురుస్తుంది. వాతావరణంలో ఇంత మార్పు రావడానికి ప్రధాన కారణం గ్లోబల్ వార్మింగ్ అని నిపుణులు చెబుతున్నారు. దాని వల్ల ఇలాంటి విచిత్ర వాతావరణం నెలకొంటుందంటున్నారు. ఎక్కడికక్కడ వాతావరణ కాలుష్యం ఈ పరిస్థితికి ప్రధాన కారణమని స్పష్టం చేస్తున్నారు. గతంలో నగరాల్లో చెట్లను నరికేసేవారు. ఇప్పుడు ఓ మాదిరి పెద్ద గ్రామాల్లో సైతం ఇదే పరిస్థితి కనిపిస్తుంది.

ముఖ్యంగా కోసీమ అంటే కొబ్బరి తోటలకు, పచ్చని వ్యవసాయ, ఉద్యాన పంటలకు ప్రసిద్ధి. అయితే గత కొన్నేళ్లుగా కొబ్బరి దిగుబడి తగ్గిపోవడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగిపోవడం, కొబ్బరి తోటలు తొలగించి, పచ్చని పొలాలను నాశనం చేసి లేఅవుట్లు వేయడం వల్ల గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోయిందని చెబుతున్నారు.

పెరిగిన ఏసీల వినియోగం

గతంలో వేసవి కాలంలోనే ఏసీలను ఎక్కువగా వినియోగించేవారు. మిగిలిన కాలాల్లో వాటి వినియోగం అంతంతమాత్రంగానే ఉండేది. అయితే ప్రస్తుతం పరిస్థితి మారింది. కాలానికి సంబంధం లేకుండా ఏసీలు వినియోగించాల్సి వస్తోంది. ప్రస్తుతం వర్షాకాలమైనా ఏసీల వినియోగం బాగా పెరిగింది. ఎండలు, ఉక్కబోత బాగా పెరిగిపోవడంతో కాలంతో సంబంధం లేకుండా వాటి వాడకం తప్పనిసరి అయ్యింది. ఒక్కసారిగా వాతావరణంలో వస్తున్న మార్పులతో రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయమే ఎండ రావడంతో ఉత్సాహంగా వ్యాపారం ప్రారంభిస్తున్నారు. అంతలోనే వాన కురవడంతో ఉసూరుమంటున్నారు. రోడ్డుపక్కన వస్తువులను పేర్చి విక్రయాలు జరిపేవారు వాన కురిసినప్పుడు వాటిని సర్దుకోవడానికి ముప్పుతిప్పలు పడుతున్నారు.

ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

అంబాజీపేట: అంబేడ్కర్‌ను అవమానపరిచిన ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, కాకినాడ రంగరాయ వైద్య కళాశాల మైదానంలో దళిత ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై దాడి చేసిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీఅభ్యుదయ యువజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులపర్తి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఇసుకపూడి దాసరివారిపేటలో నిరసన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కత్తుల సత్యనారాయణ, కోట విజయరాజు, కత్తుల నాగేశ్వరరావు, పెట్టా కృపరాజు, నెల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

రావులపాలెం: ఎస్‌జీఎఫ్ క్రీడల్లో మండల స్థాయిలో ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం సునీత, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. నేషనల్ స్కూల్ గేమ్స్ 2024–25లో భాగంగా ఎస్‌జీఎఫ్–ఏపీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19, 20 తేదీల్లో నిర్వహించిన సెలెక్షన్లలో రావులపాడు యూపీ స్కూల్ విద్యార్థులు అండర్- 14 విభాగంలో బాలుర కబడ్డీలో కె.రాజు, వాలీబాల్‌లో జి.సంజు రాయుడు, బాలికల విభాగంలో కబడ్డీలో డి.దివ్యశ్రీ, కోకోలో మేఘన ఎంపికయ్యారని కోచ్ శేఖర్ తెలిపారు. పాఠశాలకు పీటీ లేకపోయినా విద్యార్థులకు కోచింగ్ ఇచ్చిన ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు కేవీ శేఖర్‌ను హెచ్ఎం సునీత అభినందించారు.

బాధిత విద్యార్థికి రూ.15,000 సాయం

రావులపాలెం: కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థికి సోమవారం స్థానిక శ్రీఫ్రెండ్స్ సేవా సంస్థ సభ్యులు రూ.15,000 నగదు సాయం అందజేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల రావులపాలెంలో ద్వితీయ సంవత్సరం బీఎస్సీ చదువుతున్న విద్యార్థి ఎం.కార్తీక్‌కు అనారోగ్యంతో రెండు కిడ్నీలు పాడవ్వడంతో కాకినాడ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. దీంతో కళాశాల పూర్వ విద్యార్థులు, శ్రీ ఫ్రెండ్స్ సేవా సంస్థ సభ్యులు ప్రెసిడెంట్ మారుతి శ్రీనివాసరెడ్డి, అచ్చిరెడ్డి, సత్య, చైతు, ఈశ్వర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రాంబాబు తదితరులు విద్యార్థికి సాయం చేశారు. ఈ సందర్భంగా శ్రీఫ్రెండ్స్ సేవా సంస్థ సభ్యులకు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

బాధితులకు ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: మండల పరిధిలోని రెండు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి ట్రూ హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు ఉయ్యూరువారి మెరకలో బాధితుడు కొల్లాటి నరసింహమూర్తి కుటుంబానికి స్థానిక సర్పంచ్ ఓగూరి రత్నకుమారి రూ.5,000 సాయంగా అందజేశారు. అంతర్వేదికరలో బాధితుడు చొప్పల సురేంద్రకు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మోకా మోహన్‌రావు రూ.5,000 ఇచ్చారు. కార్యక్రమాల్లో గంటా శేఖర్, ఓగూరి బాబులు, గంటా బాబూరావు, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకి ఎంపిక



వీధి దుర్గారావు

అయినవిల్లి: రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 28న జరిగే జాతీయ సదస్సుకి మాగంకి చెందిన వీధి దుర్గారావు రచనలు ఎంపికైనట్లు ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీధి దుర్గారావు చింతనలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన రచించిన శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి రచనలు- సామాజిక(కుల-మత) దృక్పథాలు అనే వ్యాసం జాతీయ సదస్సుకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆయనను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

అంతర్వేది ఆలయంలో ఎమ్మెల్యే దీక్ష

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సోమవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రాయశ్చిత దీక్ష చేపట్టారు. ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా ఎమ్మెల్యే ఈ దీక్ష నిర్వహించారు. ఆయన వెంట ఎన్‌డీఏ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డాక్టర్ల నిరసన

అంబాజీపేట: పీహెచ్‌సీ వైద్యుల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓను రద్దు చేయాలంటూ వైద్యులు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన జీఓను ఉపసంహరించుకునేంత వరకూ నిరసన విరమించేది లేదని పీహెచ్‌సీ వైద్యులు చెబుతున్నారు. వైద్యులంతా రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పలువురు పేర్కొన్నారు. వైద్యుల నిరసన కారణంగా రోగులకు పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదని రోగులు వాపోతున్నారు.

వంద రోజుల ప్రగతిని వివరిస్తున్నాం

మామిడికుదురు: వంద రోజుల ఎన్‌డీఏ పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదుర్రులో సోమవారం జరిగిన ప్రజా వేదిక సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఎమ్మార్వో మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు. అప్పనపల్లి బాల బాలాజీ స్వామివారి ఆలయంలో ప్రసాదాల తయారీని ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు సోమవారం పరిశీలించారు. ప్రసాదాల తయారీలో వినియోగిస్తున్న నెయ్యి నాణ్యంగా లేదని, నాణ్యమైన నెయ్యిని వినియోగించాలని కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఆలయ ఏసీ వి.సత్యనారాయణకు ఎమ్మెల్యే సూచించారు.

అనధికార రొయ్యల సాగును నిలుపుదల చేయాలి

మామిడికుదురు: గోగన్నమఠంలో అనధికారికంగా జరుగుతున్న రొయ్యల చెరువుల సాగును నిలుపుదల చేయాలని కోరుతూ రాజోలు ఫిషరీస్ ఏడీ సిద్ధార్థ్‌వర్మకు మగటపల్లికి చెందిన బొలిశెట్టి శ్రీరామనర్సింహారావు తరఫున ఆయన సోదరుడు శ్రీరామనరేష్ వినతిపత్రం ఇచ్చారు. ఆన్‌లైన్ ద్వారా ఈ ఫిర్యాదును కలెక్టర్‌కు పంపించానని రైతు పేర్కొన్నారు. అక్రమంగా రొయ్యల సాగు చేపట్టడం వల్ల కొబ్బరి తోటలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెరువుల నుంచి వచ్చే కలుషిత జలాలు పంట పొలాలను నాశనం చేస్తున్నాయన్నారు. వీటిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

హిందీ ఉపాధ్యాయిని మృతి

పి.గన్నవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయినిగా పని చేస్తున్న యనమండ్ర అన్నపూర్ణ (55) రాయవరం గ్రామంలోని తన నివాసం వద్ద సోమవారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. రాయవరం గ్రామానికి చెందిన అన్నపూర్ణ 2021 జనవరిలో పి.గన్నవరం ఉన్నత పాఠశాలకు పదోన్నతిపై హిందీ టీచర్‌గా వచ్చారు. ఇటీవల అనారోగ్యానికి గురైన కారణంగా ఆమె కొన్ని రోజుల క్రితం సెలవు పెట్టారు. హిందీ టీచర్ అన్నపూర్ణ మృతి చెందడంతో పాఠశాలలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆమె మృతికి హెచ్ఎం ప్రసాద్‌తో పాటు, పీఎంసీ చైర్మన్ నల్లా దుర్గారావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలకు ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయులు

సఖినేటిపల్లి: మండలానికి చెందిన ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులు అమలాపురంలో జరిగిన యూటీఎఫ్ టీచర్స్ ఒలింపిక్స్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో గెలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీల్లో జీవీ పుంత ఉన్నత పాఠశాల పీఈటీ కొల్లు సతీష్‌కుమార్, అప్పనరామునిలంక ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్‌కే బాజీ విజేతలుగా నిలిచారు.

త్వరలో గుంటూరులో సంఘ పరిధిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఎంఈవో-1 డి.కిషోర్‌కుమార్, యూటీఎఫ్ నాయకులు వారిద్దరినీ అభినందించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



జొన్నాడలో సీమంతాలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆలమూరు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని సర్పంచ్ కట్టా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని జొన్నాడలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీఎస్‌వీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాండ్ర నాగమోహన్ రెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, కట్టా రామకృష్ణ, చింతలపూడి శ్రీనివాస్, చెల్లె ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.20,001 విరాళం



దాత వరప్రసాదరావు దంపతులకు చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకులు



దాత ప్రణీత్ కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలుచేస్తున్న నిత్యాన్నదాన పథకానికి తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం అజ్జరం గ్రామ వాస్తవ్యులు అద్దేపల్లి సుబ్బలక్ష్మి, వరప్రసాదరావు దంపతులు రూ.10,000, రామచంద్రపురానికి చెందిన మండలేముల పూర్ణానంద ప్రణీత్ కుటుంబ సభ్యులు సోమవారం రూ.10,001 విరాళంగా ఇచ్చారు. ఈ సొమ్మును దాతలు ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తికి అందజేశారు. దాతలను సత్కరించి స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

26న డయల్ యువర్ డిపో మేనేజర్

రావులపాలెం: ఏపీఎస్ఆర్టీసీ రావులపాలెం డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని నేరుగా పరిష్కరించేందుకు ఈ నెల 26 తేదీన డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ సోమవారం తెలిపారు. గురువారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకూ 99592 25537 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికులు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

తాలూకా గణేష్ నిమజ్జన కమిటీ అధ్యక్షుడిగా కాసు



కాసు శ్రీనివాస్

రాజోలు: రాజోలు తాలూకా గణేష్ నిమజ్జన మహోత్సవ కమిటీ అధ్యక్షుడిగా కాసు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక శివాలయ మహాన్యాస మండపంలో 2025-26 కాలానికి నిమజ్జన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కాసు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా దార్ల బాపూజీ, కాట్న రాజు, కార్యదర్శిగా పట్నాల దత్తాత్రేయ, కోశాధికారిగా కామన సత్యనారాయణ, సహ కార్యదర్శులుగా రాజా నాగరత్నకుమార్, దారపురెడ్డి బాబ్జి, అడబాల నాని, పంతాడి నాగేశ్వరరావు, సహ కార్యదర్శులుగా కాసు శ్రీనివాస రంగనాయక మూర్తి, సుబుద్ధి మహపాత్రోలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పామర్తి రమణ, అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, దార్ల పెదబాబు, రేకపల్లి నాగబాబు, కాసు సతీష్, జొన్నలగడ్డ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన ఫార్మా విజిలెన్స్ వారోత్సవాలు

రావులపాలెం: మండలంలోని ఈతకోట లిడియో కాలేజీ ఆఫ్ ఫార్మసీలో ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్న నాలుగో జాతీయ ఫార్మా విజిలెన్స్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమాన్ని కళాశాల సెక్రెటరీ గొల్లపల్లి శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.మనోహర్‌బాబు మాట్లాడుతూ డ్రగ్ ఉపయోగాలు, దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

పి.గన్నవరం: స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల సిబ్బంది, శానిటేషన్ వర్కర్లకు సోమవారం పి.గన్నవరం సీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. పంచాయతీ సిబ్బంది, కార్మికులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. డీపీఓ రాంబాబు, డీఎంఅండ్‌హెచ్ఓ దుర్గారావు దొర కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.కోటేశ్వరరావు, డాక్టర్లు అప్పారి సూర్యనారాయణ, రాబిన్, హెడ్ నర్సు అనంతకుమారి పాల్గొన్నారు.

ఓజోన్ పొర క్షీణించడం ప్రమాదకరం

మామిడికుదురు: ఓజోన్ పొర క్షీణించడం జీవరాశి మనుగడకు ప్రమాదకరమని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టీఎస్‌వీ పద్మనాభన్ పేర్కొన్నారు. ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి కార్యక్రమాన్ని సోమవారం మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మనాభన్ మాట్లాడుతూ ప్రకృతిని సంరక్షించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతన్నారు. మితిమీరిన ఫ్లోరోక్లోరో కార్బన్ల వినియోగం వల్ల ఓజోన్ పొర క్షీణిస్తుందన్నారు. హెచ్ఎం సీహెచ్ నిరంజని, ఎస్ఎంసీ చైర్మన్ వేగి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఈఓ-1 అప్పాజీకి సత్కారం



ఆలమూరులో ఎంఈఓ అప్పాజీని సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

ఆలమూరు: మండల విద్యాశాఖాధికారి-1గా బాధ్యతలు స్వీకరించిన భమిడిపాటి అప్పాజీని సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఆలమూరు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ నేతృత్వంలో మండల ఉపాధ్యాయ సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ అప్పాజీ మాట్లాడుతూ మండలంలో అన్ని పాఠశాలల అభివృద్ధికి, విద్యా ప్రమాణాలను పెంచేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఎస్‌వీ సుబ్బరాజు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

రఘురామకృష్ణంరాజుపై పోలీసులకు ఫిర్యాదు



రాజోలు సీఐ నరేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న మాలల న్యాయపోరాట సమితి నాయకులు



పుల్లేటికుర్రులో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘ నాయకులు



సఖినేటిపల్లిలో రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

రాజోలు: అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై మండల మాలల న్యాయపోరాట సమితి ఆధ్వర్యంలో రాజోలు సీఐ నరేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తొలుత స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో జేఏసీ అధ్యక్షుడు మట్టా సురేష్‌కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ తక్షణం రఘురామకృష్ణంరాజుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమాల్లో మండల మాలల న్యాయపోరాట సమితి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రఘురామకృష్ణంరాజు తీరు అమానుషం

అంబాజీపేట: రఘురామకృష్ణంరాజు రాజ్యాంగ పదవిలో ఉండి రాజ్యాంగ నిర్మాతపై కనీస గౌరవం లేకుండా ప్రవర్తించిన తీరు అమానుషమని దళిత సంఘ నాయకులు అన్నారు. మండలంలోని పుల్లేటికుర్రులో అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రఘురామకృష్ణంరాజు వెంటనే అంబేడ్కర్‌కు, దళితులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. అనంతరం రఘురామకృష్ణంరాజు చిత్రపటాలను దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూకపెయ్యి చిన్న, జల్లి సుబ్బారావు, మట్రి ఏడుకొండలు, బట్టు బంగారం, జల్లి శ్రీను, పెట్టా శ్రీనివాసరావు, నల్ల విజయ్‌కుమార్, బీర ప్రకాష్ పాల్గొన్నారు.

ఉండి ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకోవాలి

సఖినేటిపల్లి: ఏలూరుపాడు గ్రామంలో అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపేసి అవమానపరచిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం మండల ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మూడుతూములు సెంటర్లో ఎమ్మెల్యే వైఖరికి నిరసనగా ఆయన దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కుసుమ చంద్రశేఖర్, తాడి సహదేవ్, చింతా రాజబాబు, గెడ్డం ఫిలిప్ రాజు, కొల్లాబత్తుల నాని, నల్లి శివకుమార్, కుసుమ చింటూ తదితరులు పాల్గొన్నారు.

ఉండి ఎమ్మెల్యేను అరెస్టు చేయాలి

మామిడికుదురు: ఫ్లెక్సీను చించేసి అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును 36 గంటల్లో అరెస్టు చేయాలని, లేదంటే పశ్చిమగోదావరి జిల్లాలోని ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బొంతు మణిరాజు, జిల్లా పోరాట సమితి అధ్యక్షుడు నల్లి శ్రీను హెచ్చరించారు. రఘురామకృష్ణంరాజును చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మామిడికుదురు బస్టాండ్ సెంటర్‌లో మాల మహానాడు ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. 216వ నంబర్ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. అనంతరం నగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిరసనలో డీసీసీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పిల్లి శ్రీను, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, మెడబల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

మలికిపురం: ఏలూరుపాడులో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేసి, అవమానపరిచిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు దిష్టి బొమ్మను సోమవారం మలికిపురం సెంటర్‌లో మండల మాల న్యాయపోరాట సమితి ఆధ్వర్యంలో దహనం చేశారు. తొలుత స్థానిక పూలే, అంబేడ్కర్ భవనం నుంచి ఎమ్మెల్యే దిష్టి బొమ్మను ర్యాలీగా మలికిపురం సెంటర్‌కు తీసుకెళ్లి దహన సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల జేఏసీ అధ్యక్షుడు తోటి రాజేష్, నియోజకవర్గ కోర్ కమిటీ సభ్యులు చింతా రాజబాబు, గెడ్డం తులసీ భాస్కరరావు, గెడ్డం ఫిలిప్‌రాజు, నల్లి శివకుమార్, జిల్లెళ్ల ఉదయ్, తాడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.